క్లుప్తంగా

వర్షాలకు నేల కూలిన పెంకుటిల్లు



కన్నాయిగూడెం : మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో బుట్టాయిగూడెంలోని కావిరి సుధాకర్‌కు చెందిన పెంకుటిల్లు శనివారం కూలిపోయింది. ప్రస్తుతం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని ప్రభుత్వాన్ని బాధితుడు కోరుతున్నాడు.

యూనిఫాం అందజేత

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 150 మంది పేద పిల్లలకు ఆర్‌డీటీ సంస్థ నిర్వాహకులు శనివారం యునిఫాంలను అందజేశారు. తాళ్లపహాడ్‌లో వెంకటాపురం ఎస్సై చల్ల రాజు చేతుల మీదుగా యునిఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పేద పిల్లలకు ఆర్‌డీటీ సంస్థ నిర్వాహకులు యునిఫాంలను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ నిర్వాహకులు సంజీవకుమార్, రమేష్, ప్రతాప్, ప్రమీల పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

వాజేడు : మండలంలోని ధర్మవరం ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవితేజ, రవి అన్నారు. పాఠశాల గోడకు గేటు లేక పోవడంతో పశువులు, ఇతరులు లోపలికి వెళ్తున్నట్లు ఆరోపించారు. తాగునీటి నల్లాలు సక్రమంగా లేవని, పాఠశాల ఆవరణలో వర్షం పడితే నీరు నిలిచే అవకాశం ఉందన్నారు. దీంతో విద్యార్థులు జారి పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోదెబోయిన సాయి పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

ఏటూరునాగారం : అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ముల్లకట్ట–రాంపూర్ గ్రామాల మధ్య గుర్రంపేటలో గుడుంబా విక్రయిస్తున్నారని పక్కా సమాచారం మేరకు ఆ గ్రామాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. కోగిల చిన్నినర్సయ్య ఇంట్లో గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. గుడుంబాను కన్నాయిగూడెం మండలం అంజన్‌రావు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ రవి,, హరీష్‌లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలి



మురికి కాల్వను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

వెంకటాపురం(ఎం) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున మురికి నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ రాజు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు సైడు కాల్వల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలన్నారు. మురికి గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని జీపీసిబ్బందికి సూచించారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి



మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(కె) : గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణపై కొందరు వ్యక్తులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను మానుకోవాలని జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జీఎస్పీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్ల మండలానికి చెందిన వ్యక్తులు తమ స్వార్థప్రయోజనాల కోసం ఆర్థికంగా ఎదగడానికి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకోవాలని అన్నారు. పూనెం ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి

- రోడ్డుపై భారీ గుంతలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

మంగపేట : మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ప్రధానంగా మండలంలోని కమలాపురం నుంచి మల్లూరు వరకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు వందలాది ఇసుక లారీల రాకపోకలతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. పలు కల్వర్టుల వద్ద రోడ్డు కుంగిపోవడంతో గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గంపోనిగూడెం సమీపంలోని గిరిజన పెట్రోల్ బంక్ వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నిర్మించిన కల్వర్టు వరద కోతకు గురై సగానికి పైగా కొట్టుకు పోవడంతో పాటు కోమటిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మోకాలు లోతుతో భారీ గొయ్యి ఏర్పడిన విషయం తెలిసిందే. అత్యంత ప్రమాదకరంగా తయారైన ఆయా ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ అధికారులు నామమాత్రంగా మట్టి, కంకరతో కూడిన డస్ట్ పోసి చేతులు దులుపుకున్నారు. రెండు రోజుల క్రితం కురిసిని భారీ వర్షానికి మట్టి, డస్ట్ కొట్టుకుపోయింది. దీనికి తోడు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్, బోరునర్సాపురం, మల్లూరు వద్ద రోడ్డుపై వర్షపునీరు నిలిచి భారీ గోతులు ఏర్పడ్డాయి. గోతుల్లో నీరు ఉండటంతో అవి ఏర్పడక ద్విచక్ర వాహనదారులు అందులో పడి స్వల్ప గాయాలైన సంఘటనలు ఉన్నాయి. రోడ్డుపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేపట్టడంలో ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రయాణికులు, వాహనదారులు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోమటిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపై భారీ గుంతలు



ప్రమాదం జరుగకుండా కర్రలకు ఎర్రటి వస్త్రంతో ఏర్పాటు చేసిన హెచ్చరిక

ముంపు ప్రాంతాల సందర్శన

- మేడారం వెళ్లే వాహనాల దారి మళ్లింపు

గోవిందరావుపేట : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ముంపు ప్రాంత గ్రామాలను మండల అధికారులు శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. మండలంలోని రాఘవపట్నం, ముత్తాపూర్, పస్రా నాగారం, గుండ్లవాగు బ్రిడ్జి ప్రవాహాన్ని తహసీల్దార్ సృజన్ కుమార్ పరిశీలించారు. మండల కేంద్రంలోని దయ్యాలవాగు బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో చుట్టూ ఉన్న నివాస పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున ముందుజాగ్రత్త చర్యగా ఎంపీడీఓ మమత పర్యటించారు. అక్కడి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పస్రా నుంచి మేడారం వెళ్లే దారిలో ప్రాజెక్టునగర్ దాటాక బాంబుల మోరి (యాసంగి తోగు) దగ్గర రోడ్డు మీది నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మేడారం వెళ్లాల్సిన వారు. మేడారం నుంచి పస్రాకు వచ్చే ప్రయాణికులు తాడ్వాయి మీదుగా రావాలని, రోడ్లు దాటే సమయంలో ఎవరికైనా, ఏదైనా ఇబ్బంది కలిగితే వెంటనే పస్రా పోలీస్‌స్టేషన్ 712670085, 8712670986 నంబర్లకు లేదా 100కి కాల్ చేయాలని అని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ప్రజలకి విజ్ఞప్తి చేశారు.



గోవిందరావుపేటలో ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మమత

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మండల గౌడ సంఘం నాయకుడు మారగోని రాజు గౌడ్

కన్నాయిగూడెం: కల్లుగీత కార్మికుల సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని మండల గౌడ సంఘం నాయకులు మారగోని రాజు గౌడ్ అన్నారు. మండలంలోని గీత కార్మికులు శనివారం బుట్టాయిగూడెం నుంచి లక్ష్మీపురం జంక్షన్ వరకు వరకు బైక్ ర్యాలీ తీశారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలో బైక్ ర్యాలీ తీసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజు గౌడ్, అశోక్ గౌడ్ హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం రాజు గౌడ్ మాట్లాడూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చన హామీ వెంటనే నెరవేర్చాలన్నారు. హక్కుల కోసం ఐక్యపోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో తాళ్లపల్లి నరేందర్, పాలకుర్తి కుమారస్వామి, భిక్షపతి, శ్రీధర్, దేవరకొండ మోహన్, తాటి లచ్చలు, తాటి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నాయకులు

‘సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించాలి’

ఏటూరునాగారం : భారతదేశ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, లౌకికత్వాన్ని కాపాడాల్సిన ప్రతిపత్తి కలిగిన కోర్టులు ఎన్నికల కమిషన్లకు ప్రభుత్వ చేతుల్లో బందీలుగా మారాయని సీపీఎం జిల్లా వర్గ సభ్యుడు ఎండి.దావూద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 నెలల క్రితం సర్ పేరుతో జనవరి 2025న ఎనిమిది కోట్ల ఓటర్లు ఉండగా 24 జూన్ నుంచి 25 జూలై వరకు ఒక్క ఓటు కొత్తది నమోదు చేయలేదని పేర్కొన్నారు. ఆగస్టు 2న 65 లక్షల ఓట్లు తొలగించారంటున్నారు కానీ అవి కోటి వరకు చేరే అవకాశం ఉందన్నారు. ఆధార్, రేషన్ కార్డు పరిగణలోకి తీసుకోరని ఎన్నికల కమిషన్ చెప్పడంలో ఆంతర్యం ఏమిటని పేర్కొన్నారు. అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలన్నారు.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయండి

- ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జ్ చాతాల రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

వాజేడు: చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జ్ చాతాల రమేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ వావిలాల స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆసరా పింఛన్ల పెంపుపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగులు, వితంతువులు, వృద్ధుల గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి మాదిగ, మల్లక్క, బతకమ్మ, శాంత, రామ్మూర్తి, శ్రీను, ఈశ్వరి, నరసమ్మ, పెద లక్ష్మి, సమ్మక్క, బాబు తదితరులు పాల్గొన్నారు.

వాజేడు మండలంలో భారీ వర్షం



పూసూరు, ఏడ్జెర్లపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి చేరిన వర్షం నీరు

వాజేడు : మండలంలో చాలా రోజుల తర్వాత భారీ వర్షం కురిసింది. మండలంలో 72.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. జలకళ తప్పిన వాగులు వంకలు ఒక్కసారిగా జల కళను సంతరించుకున్నాయి. మండలంలోని పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పూసూరు, ఏడ్జెర్లపల్లి గ్రామాల మధ్యన వర్షం నీరు రహదారిపై నుంచి ప్రవహించింది. అధికారులు శుక్రవార రాత్రి నుంచి అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ఎప్పటికప్పుడు చర్యలను చేపట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

మండలంలో వర్షాలు పడటంతో పాటు ఎగువ ప్రాంతంలోని కడెం, ఎల్లంపల్లి, సరస్వతి బ్యారేజ్ గేట్లు ఎత్తి ఉండటంతో దిగువకు వరద నీరు వస్తుందని తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి గోదావరికి నీటిని విడుదల చేయడంతో వరద పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి వరద సమయంలో ప్రజలు రహదారులను దాటడం, చేపల వేటకు వెళ్లడం, పశువులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు వరదలు తగ్గే వరకు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

వనదేవతలకు మొక్కులు



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను ఛత్తీస్‌గఢ్ బీజేపీ నేతలు శనివారం వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బీజాపూర్ బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, బస్తర్ జిల్లా ఇన్‌చార్జ్ గుజ్జ వెంకటర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బీజాపూర్ జిల్లా పార్టీ నాయకులు ఆయనతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు నిర్వహించారు. ఆయన ఎన్నిక సందర్భంగా భారీ వాహనాలతో బీజేపీ నాయకులు మేడారానికి తరలివచ్చారు.నాయకులు మూసి రాంసింగ్, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పంచాయతీ అధ్యక్షురాలు జానకి కోర్సా, పాల్గొన్నారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల కోలాహలం

- స్వామివారి నిజరూప దర్శనంతో పులకించిన భక్తజనం

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు గుట్టపై వెలిసిన శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల కోలాహలంతో సందడిగా మారింది. స్వయంభు స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేట్ వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయంలోని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు తిలతైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు, పండ్లు సమర్పించారు. ఆలయ పూజారులు భక్తుల గోత్రనామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో నిత్య అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల సందడి నెలకొంది.



ఆలయంలోని స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అలుగు పోస్తున్న వెదుల్ల చెరువు



వెంకటాపురం(కె): అలుగు పోస్తున్న చెరువు



వాజేడు: అలుగు పోస్తున్న చెరువుకు అడ్డుగా ఇసుక బస్తాలు వేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. చెరువులు నిండు కుండలా మారాయి. నూగూరు గ్రామ సమీపంలోని వెదుల్ల చెరువు వరద నీటితో నిండడంతో అలుగు పోస్తుంది. కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండల కేంద్రంలోని కంకలవాగు ప్రమాదస్థాయిని దాటి ఉధృతంగా ప్రవహిస్తుంది.

అలుగు తెగకుండా ఇసుక బస్తాల ఏర్పాటు

వాజేడు : మండలంలో కురిసిన భారీ వర్షానికి అరుణాచలపురం చెరువు అలుగు పోస్తుంది. వరద తాకిడికి అలుగు గోడ పక్కన ఉన్న మట్టి కొట్టుకుపోతుండడంతో అప్రమత్తమైన మారుమూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఉన్నతాధికారుల సలహా మేరకు గ్రామస్తులతో మరమ్మతు చేయించారు. బస్తాల్లో ఇసుకను నింపి ట్రాక్టర్ ద్వారా తరలించి అలుగు గోడ పక్కన తెగుతున్న మట్టి కట్టకు అడ్డుగా పెట్టారు. మట్టి కట్ట తెగితే అలుగు పోస్తున్న గోడకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో వెంటనే ఇసుక బస్తాలతో మరమ్మతు చేపట్టారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఏటూరునాగారం : శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్, రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హరేరామ.. హరేకృష్ణ..రామనామమునకు ఉన్న విశిష్టతను ఇస్కాన్ మండల ఇన్‌చార్జ్ కృష్ణదాస్ భక్తులకు వివరించారు. అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ, కత్తెర శ్రీను, దీనభాండవస్వామి, వేణుగోపాల్ లాహోటి, చిత్తుబోత్తుల సదానందం, ఎగ్గడి జగదీష్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంగపేట : మండలంలోని రమణక్కపేటలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు, మహిళలు, యువతీ యువకులు చిన్నారులు పాల్గొని రంగుల నీళ్ల చల్లుకుంటూ ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో ఆలయ యాదవ సంఘం నాయకులు గుండేటి రాజు యాదవ్, వీర్ల నాగనర్సయ్యయాదవ్, పయ్యావుల బాబూరావు యాదవ్, పిఎస్ఆర్ యాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

వాజేడు : మండలంలోని గుమ్మడి దొడ్డి, ధర్మవరం గ్రామాల్లో ఉట్ల పండుగను నిర్వహించారు.

వెంకటాపురం(కె) : మండలంలోని గొల్లగూడెం గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యువకులు, చిన్నారులు ఉట్టి కొట్టారు.



మంగపేట: అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న యాదవులు



వాజేడు : ఉట్టి కొడుతున్న బాలుడు



ఏటూరునాగారం : ఉట్టి కొట్టేందుకు ప్రయత్నిస్తున్న మాజీ రామాలయ చైర్మన్ లక్ష్మీనారాయణ



వెంకటాపురం(కె) : ఉట్టి కొడుతున్న చిన్నారులు

దేశం కోసం పోరాటం..

- సాయం కోసం ఎదురు చూపు

వాజేడు : దేశం కోసం పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలను సాధించినప్పటికి మరో సారి పోటీల్లో పాల్గొనడానికి మండలంలోని ఇప్పగూడేనికి చెందిన మోడం వంశీ ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తున్నాడు. పట్టుదలతో పవర్ లిఫ్టింగ్ నేర్చుకొని విదేశాల్లో పలు పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 5 వరకు సాన్ జోష్ కోస్టారీకాలో జరిగే అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియా గతంలో వంశీ సాధించిన విజయాలను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేసింది. వంశీ ఈ పోటీల్లో పాల్గొనడానికి ఎంట్రీ ఫీజు, ఖర్చులతో కలిపి రూ 4.50 లక్షలు అవసరం అయ్యాయి. నిరుపేద అయిన వంశీ వద్ద అంత స్థోమత లేకపోవడంతో ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాడు. ఆర్థికసాయం చేయాలనుకున్న వారు 8074581584 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే చేయగలరని వంశీ కోరుతున్నాడు.



వంశీ

బాధిత కుటుంబాలకు పరామర్శ

వెంకటాపురం(కె): ఇటీవల వాగులో గల్లంతై మృతి చెందిన ఆశ వర్కర్ ఇరప లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేవా జిల్లా అధ్యక్షుడు కుంజా మహేష్ డిమాండ్ చేశారు. శనివారం లక్ష్మి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురం గ్రామంలో బ్రిడ్జి లేకపోవటం వల్లనే గిరిజన మహిళ మృతి చెందిందని ఆరోపించారు.

ములుగు రూరల్: ఇటీవల కాలంలో మల్లంపల్లిలో మృతి చెందిన తూర్పాటి మధు కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని కాల్వపల్లికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ అలెం బాలరాజు ఇటీవల మృతి చెందగా శనివారం జరిగిన ఆయన పెద్దకర్మకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి నాయకులు రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట మండల అధ్యక్షుడు దేవేందర్, మేడారం జాతర చైర్మన్ లచ్చుపటేల్, మాజీ సర్పంచ్ సునీల్ ఉన్నారు.

పైరిత్రం మందు పిచికారీ

వాజేడు : మండలంలోని శ్రీరాంనగర్ గ్రామంలో ఉన్న 40 ఇళ్లలో పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం పైరిత్రం మందును పిచికారీ చేశారు. గ్రామంలో ఒకరికి డెంగీ ఉన్నట్లు అనుమానం ఉండటంతో మిగతా వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలను చేపట్టారు. డెంగీ జ్వరానికి కారణమయ్యే దోమల నివారణ కోసం ఈ మందును పిచికారీ చేసినట్లు హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ తెలిపారు. కార్య క్రమంలో జయంతిలాల్, ఆశ కార్యకర్త ఉన్నారు.



పైరిత్రం మందును పిచికారీ చేస్తున్న ఆరోగ్య కేంద్రం సిబ్బంది

పైపులైన్ లీకేజీతో వృథాగా నీరు

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం వద్ద మిషన్ భగీరథ పైపు లీకై నీరు వృథాగా పోతుంది. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామంలోకి కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. శనివారం బుట్టాయిగూడెంలోని ప్రధానకూడలి అమరవీరుల స్తూపం వద్ద పైప్‌లీకై నీరు ప్రధాన రహదారి వెంట వర్షపు నీరు ప్రవహించినట్లు ప్రవహిస్తోంది. నీరు వృథాగా పోతుండడంతో కాలనీవాసులు సంబంధిత ఏఈ కి ఫోన్‌లో సమాచారం అందించినా అందుబాటులోకి రాలేదని తెలిపారు. మరమ్మతులు చేసి నీటి సరఫరా అయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

